
## క్లుప్తంగా

### కామేశ్వరీదేవికి ఫలాలతో అలంకరణ


పూజలందుకున్న అమ్మవారు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవిని శుక్రవారం వివిధ రకాల ఫలాలతో మాలలుగా చేసి అలంకరించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ముఖ్య అర్చకులు వనిపెంట ప్రకాశం శర్మ, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరి దశకు చేరుకోవటంతో పలు ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

### పారిశుద్ధ పనులు


వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు, కృష్ణారావుపేట గ్రామాల్లో సర్పంచ్ వరప్రసాద్ శుక్రవారం పారిశుద్ధ పనులు చేపట్టారు. అంతర్గత వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు కాచి వడగట్టిన నీటిని తాగాలని సర్పంచ్ సూచించారు.

### మల్లన్నకు నృత్య నివేదన


నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన జి.సంధ్య, బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మూషికవాహన, శ్రీగిరిశంకరా, జతిస్వరం, నమశ్శివాయతే తదితర గీతాలకు షణ్ముఖ, వైదిత, అక్షిత, పూజ, శ్రేయ, మన్విత, పరిణీత, అవంతిక, వైష్ణవి, భవ్య, మానస తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

### మహానందీశుడి దంపతులకు పల్లకీసేవ


మహానందిలో పల్లకీసేవ జరుగుతున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి మహానందీశ్వరస్వామి దంపతులు పల్లకీలో విహరించారు. ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ముందుగా మహానందీశ్వరస్వామి దంపతులకు స్థానిక అలంకార మండపంలో ప్రత్యేక పూజా హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు.

### భ్రమరాంబా దేవికి ఊయలసేవ


అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి కూడా విశేష పూజలు నిర్వహించారు.

### పెన్షన్లు తొలగించడం తగదు

కొత్తపల్లి: అనర్హుల పేరుతో అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగించడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, మండల కార్యదర్శి ఎస్ స్వాములు అన్నారు. శుక్రవారం శివపురంలో వారు పర్యటించి తొలగించిన లబ్ధిదారుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 శాతం వికలత్వం ఉన్న వారికి కూడా పింఛన్ తొలగించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేవారు. సీపీఎం సీనియర్ నాయకులు ఎస్ సంజీవ రాయుడు, దేవకుమార్, గోపాల్ పాల్గొన్నారు.

# ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

వెలుగోడు: అందరి సహకారంతో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ప్రతి ఏడాది వినాయక చవితి ఉత్సవాలను ఆత్మకూరులో శాంతియుతంగా జరుపుకుంటున్నామని, అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు. మండపాల ఏర్పాట్ల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వినాయక నిమజ్జనం సమయంలోనూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరగడానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. పోలీసుల సలహాలు, సూచనలు పాటించేలా ఉత్సవ కమిటీ సభ్యులు చూడాలన్నారు. సమావేశంలో ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

### అనుమతులు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ తిరుపాలు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ గ్రామాల వినాయక ఉత్సవ కమిటీల సభ్యులతో ఇన్‌చార్జ్ ఎస్‌ఐ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు పూజలు నిర్వహించి వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలన్నారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు.

### మండపాల ఏర్పాట్లలో జాగ్రత్తలు తీసుకోండి

నందికొట్కూరు/జూపాడుబంగ్లా: వినాయక విగ్రహాల మండపాల ఏర్పాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలని నందికొట్కూరు ట్రాన్స్‌కో ఏడీ వి.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వినాయక విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మండపాలు ఏర్పాటు చేసుకోవద్దన్నారు. మండపాలకు జాయింట్లు లేని వైర్లు ఉపయోగించాలని సూచించారు. మండపాలకు విద్యుత్ సౌకర్యం కోసం తగిన రుసుము చెల్లించి రసీదు పొందాలన్నారు.

### ఆపదలో ఉంటే కాల్ చేయండి

మహానంది: ఆపదలో ఉంటే వెంటనే శక్తియాప్ నంబర్‌కు ఫోన్ చేయాలని నంద్యాల డివిజన్ శక్తిటీం హెడ్ కానిస్టేబుల్ డీఎన్ ప్రసాద్, మహిళా పీసీ స్నేహలత విద్యార్థినులు, మహిళలకు విజ్ఞప్తి చేశారు. తిమ్మాపురంలో శుక్రవారం విద్యార్థులకు పోలీస్ చట్టాలు, సైబర్ క్రైమ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.

### పరోక్షసేవగా వీరభద్రస్వామికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకుడు బయలు వీరభద్రస్వామికి శుక్రవారం భక్తులు పరోక్ష సేవగా పూజలు జరిపించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి 25 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా విశేషపూజను జరిపించుకున్నారు. ముందుగా మహాగణపతి పూజ, అనంతరం పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం నిర్వహించారు.

# సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

జూపాడుబంగ్లా: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకుడు షేక్ ఇస్మాయిల్ కోరారు. శుక్రవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇస్మాయిల్, సీఐటీయూ జిల్లా నాయకుడు రణధీర్, ఉస్మాన్, కర్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.


నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

### కులధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు

ఆత్మకూరు: ఇంతవరకు కులధ్రువీకరణ పత్రం పొందని వారికి కుల ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రతి గ్రామ, వార్డు కార్యాలయాల్లో టీసీ, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పాత కుల ధ్రువీకరణ పత్రం తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు.

### ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరు: ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం బైర్లూటీ పీహెచ్‌సీ పరిధిలోని రుద్రకోడు గూడెంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున తాగునీటిని తప్పనిసరిగా కాచి, చల్లార్చి, వడబోసుకుని తాగాలన్నారు. రాత్రి పూట దోమతెరలు వాడాలని, ఏవైనా అనారోగ్య పరిస్థితులు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు. అనంతరం పలువురికి వైద్యం సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కుద్దూస్‌బాషా, ఎంఎల్‌హెచ్‌పీ శివకుమార్, ఆరోగ్య కార్యకర్త భాస్కర్, భీమేశ్వరి పాల్గొన్నారు.

### మహానందిలో నల్లనాగు


నల్ల నాగును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ మోహన్

మహానంది: స్థానిక దేవస్థానం పరిధిలోని కరివేన సత్రం సమీపంలో శుక్రవారం పది అడుగుల నల్ల నాగు కలకలం రేపింది. పామును గుర్తించిన స్థానికులు అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించారు. అతడు అక్కడికి చేరుకుని చాకచక్యంగా పామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశాడు.

### నేడు శ్రీశైలం డ్యాం వద్ద ఆక్టోపస్ మాక్‌డ్రిల్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం డ్యాం వద్ద ఆక్టోపస్ బృందం శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించనుంది. అనుకోని ఘటనలను ఎదుర్కొనేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలని, భద్రతా పరంగా ఎటువంటి చర్యలు తీసుకోవాలని ఏటా ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి డ్యాం వద్ద ఆక్టోపస్ బృందంలో ఎస్పీ, డీఎస్పీ, ఆర్‌ఐ-3, ఆర్‌ఎస్‌ఐ-5, హెడ్‌కానిస్టేబుల్స్-8, పీసీ-20 మంది మొత్తం 38 సభ్యులతో ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహిస్తారు. అలాగే డ్యాం భద్రతపై తీసుకోవాల్సిన చర్యల గురించి డ్యాం వ్యూ పాయింట్ వద్ద సమీక్షా సమావేశ భవనంలో సమీక్ష నిర్వహిస్తారు.

### ప్రమాణ స్వీకారం

జూపాడుబంగ్లా: 80 బన్నూరు సహకారసొసైటీ నూతన పాలకవర్గం కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే గిత్త జయసూర్య సమక్షంలో సొసైటీ సీఈఓ చంద్రశేఖర్‌గౌడు శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించారు. సొసైటీ చైర్మన్‌గా తంగడంచ పిక్కిలి శ్రీనివాసులు, సభ్యులుగా మండ్లెం తిరుపతి రెడ్డి, తరిగోపుల శేఖర్‌లతో సీఈఓ ప్రమాణ స్వీకారం చేయించారు.

### పల్లకీలో కృష్ణ భగవానుడి విహారం

ఓర్వకల్లు: మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని కొలువుంచిన స్వాముల వారి ప్రతిమను శుక్రవారం మధ్యాహ్నం అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాముల వారి ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని నందికొట్కూరు రోడ్డులో గల పాల డైరీ పక్కన కొలువుంచిన స్వాముల వారికి వారం రోజుల పాటు భక్తులు నిత్యపూజలు, భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహించి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అశేష జనసందోహాల మధ్య స్వాముల వారి ప్రతిమను పల్లకీలో ఆశీనులను గావించి, ప్రాంగణం నుంచి బయలుదేరి మెయిన్‌బజార్, రచ్చకట్ట మీదుగా ఆంజనేయస్వామి గుడి వరకు స్వాముల వారిని ఊరేగించారు. అనంతరం తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు శ్రీకృష్ణుడి నామస్మరణతో గీతాలు ఆలపించారు. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓర్వకల్లు, చింతలపల్లె ఉత్సవ కమిటీ సభ్యులు చిన్నపుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కుమారాచారి, సంజీవ, పార్థసారథి, నాగమద్దిలేటి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.


కృష్ణ భగవానుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

### యూరియా సరఫరా చేయాలి

కొత్తపల్లి: రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, మండల అధ్యక్షులు గంగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్ద గుమ్మడాపురం గ్రామం రైతులతో కలిసి మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అధికారులు స్పందించి రైతులకు సరిపడా యూరియాను సమకూర్చాలన్నారు. అనంతరం పెద్దగుమ్మడాపురం రైతు సంఘం కమిటీని ఎన్నుకున్నారు.


రైతులతో కలసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

### వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా సంజీవరాయ ప్రసాద్

వెలుగోడు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం జరిగిన ఆర్యవైశ్యుల విస్తృత స్థాయి సమావేశంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా తాళ్లూరి సంజీవరాయ ప్రసాదను ఎన్నుకున్నారు. సెక్రటరీగా తాళ్లూరి గోపాల్, ట్రెజరర్‌గా తాళ్లూరి కళ్యాణిని ఎన్నుకున్నారు. అనంతరం నియామక పత్రాలను ఐఈసీ ఆఫీసర్ భూమా సూర్యనారాయణ, గవర్నర్ కందుకూరు సుబ్బరామయ్య, రీజినల్ చైర్మన్ లింగం నాగశైలజకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు లాలం సుధాకర్, లాలం ప్రసాద్, నందనం క్లబ్ ప్రెసిడెంట్ నాగేంద్ర, చిత్రాల రమణయ్య, ప్రభాకర్, జూటూరు శ్రీనివాసులు, లాలం సత్యనారాయణ పాల్గొన్నారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

బండి ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం డాక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. 460 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 47 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫీ పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పగిడ్యాల: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, న్యాయవాది మద్దయ్య సూచించారు. శుక్రవారం స్థానిక దేవనగర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక స్పెషల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం ద్వారా సంక్రమించిన రిజర్వేషన్ ఫలాలను పొందుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలన్నారు. సదస్సులో ముచ్చుమర్రి ఏఎస్‌ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డులు సద్వినియోగం చేసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏహెచ్ వెంకటేశ్వర్లు

పాములపాడు: రైతులు అనిమల్ హెల్త్ కార్డ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని వెలుగోడు ఏడీఏహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక పశు వైద్యశాలను తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఐదుగురు రైతులకు పీఎం కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేశారు. వీటి ద్వారా బ్యాంకులో తక్కువ వడ్డీకి రుణాలు పొందవచ్చన్నారు. అనంతరం మండలంలోని రుద్రవరం, చెలిమిళ్ల గ్రామాల్లో పర్యటించి పాడి రైతులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. పెయ్య దూడలు పుట్టడానికి ఇచ్చిన ఎద సూది వల్ల మేలు జాతి దూడలు జన్మించాయని చెబుతూ ఆ దూడను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ భాస్కర్ ఉన్నారు.

### హామీలను అమలు చేయాలి

ఆత్మకూరు: రజకులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని శుక్రవారం స్థానిక పట్టణంలోని చిట్యాల వీధిలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు బీసీ తరగతుల వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం ఆ ఊసే మరిచారన్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ ద్వారా రజకుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలని, ధోబీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రజక సంఘం పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి బావాపురం శ్రీరాములు, నాయకులు శివ, శేఖర్, కృష్ణ, స్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

### వివాహితపై ఆటో డ్రైవర్ అత్యాచారయత్నం

నంద్యాల: రైలు దిగి ఇంటికి వెళ్తున్న మహిళపై ఆటోడ్రైవర్ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడు తెలిపిన వివరాల మేరకు..బుధవారం అర్ధరాత్రి ఓ మహిళ తన పాపతో కలిసి గుంతకల్లు నుంచి నంద్యాల రైల్వే స్టేషన్‌కు వచ్చింది. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లేందుకు ఆటో మాట్లాడుకుంది. వైఎస్సార్‌నగర్‌కు చెందిన సమరసింహం అనే ఆటో డ్రైవర్ బస్టాండ్‌కు తీసుకెళ్లకుండా మార్గమధ్యలో దారి మళ్లించి మహిళపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేసి అతని నుంచి తప్పించుకొని నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

### యువకుడి అదృశ్యం

వెల్దుర్తి: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన దేశపోగు రమేశ్ (33) కనిపించడం లేదని తండ్రి నారాయణ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. ఈనెల 21న బైక్‌పై కర్నూలుకు వెళ్లి వస్తానని వెళ్లి తిరిగి రాలేదని, పలు చోట్ల వెదికినా ఫలితం లేకపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు రమేశ్ భార్య చనిపోగా అతనిపై కేసు పెండింగ్‌లో ఉంది. గ్రామం నుంచి వెళ్లిననాటి నుంచి అతని ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ వస్తుండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

# సేవా దృక్పథం అలవాటు చేసుకోండి


సీటు సాధించిన విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

వెలుగోడు: చిన్నతనంలోనే సేవా దృక్పథం అలవాటు చేసుకోవాలని జెడ్పీ రిటైర్డ్ సీఈఓ జైపాల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం మాలిక్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సేవలను అభినందించారు. అనంతరం మెడిసిన్, ఎంబీబీఎస్, ట్రిపుల్ ఐటీ, బీహెచ్‌ఎంఎస్‌లో సీట్లు సాధించిన, పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ వేల్పుల జైపాల్, ఎంఈఓ బ్రహ్మం నాయక్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి, ఉపాధ్యక్షుడు జయరాం రెడ్డి, కార్యదర్శి మక్బుల్ బాషా, సహాయ కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నీటిని బయటకు పంపాలి

మహానంది: మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపాలని ఏఓ నాగేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. మసీదుపురంలో శుక్రవారం మొక్కజొన్న పొలాలను సందర్శించారు. పొలాల్లో నీరు అలాగే ఉంటే పైరు దెబ్బతిని దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. నీటిని కాలువల ద్వారా బయటకు పంపి యూరియా లేదా పొటాష్ ఎంఓపీ... నైట్రేట్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవలని సూచించారు.


రైతులకు సూచనలిస్తున్న ఏఓ నాగేశ్వరరెడ్డి

# నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ రామాంజినాయక్

పగిడ్యాల: పశువుల అవసరాల అంచనా(లైవ్‌స్టాక్ నీడ్ అసిస్టెంట్ సర్వే)ను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జూపాడుబంగ్లా డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజి నాయక్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పాత ముచ్చుమర్రి పశువైద్యశాల, నెహ్రూనగర్ గ్రామ వైద్యశాలలను ఏడీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు రైతులు పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. పశుగ్రాస పెంపకాలను చేపట్టేందుకు ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తుందన్నారు. పశువుల సంక్షేమం కోసం అవసరమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడానికి ఉద్దేశించి చేపట్టిన సర్వేకు రైతులు సహకరించాలన్నారు. పశువులకు ఏమి అవసరం, రైతులకు ఏఏ సమస్యలు ఉన్నాయి, వాటిని తీర్చడానికి ఏలాంటి తోడ్పాటును అందించాలనే వివరాలు ఈ సర్వే ద్వారా తెలుస్తుందన్నారు. అందువల్ల ఎన్యుమరేటర్లు గ్రామాల్లో పశుపోషకుల వద్దకు చేరి సర్వేను వేగవంతం చేసి ఈనెలాఖరులోగా నివేదికను అందజేయాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యులు రాగసంధ్య, ఏహెచ్‌ఏ చరిత ఉన్నారు.

# రోడ్లను బాగు చేయండి


ఆత్మకూరు: పట్టణంలోని అర్బన్ కాలనీ, సూరన్నతోటలో డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచి చెరువులను తలపిస్తున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు ఎ.సురేంద్ర, డి.రామ్‌నాయక్, షేక్ ఇస్మాయిల్ అన్నారు. శుక్రవారం అధ్వానంగా ఉన్న రోడ్లను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈనెల 20న మంత్రి గుమ్మడి సంధ్యారాణి వచ్చిన సందర్భంగా రోడ్లపై ఆగిన నీరు వెళ్లేందుకు మున్సిపల్ అధికారులు గుంతలు తీసి వాటిని పూడ్చకుండా వదిలేశారన్నారు. ఇదే విషయాన్ని కాలనీ వాళ్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎవరి ఇంటి ముందు వాళ్లే పూడ్చుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానవ్వడం తగదన్నారు. గుంతలను పూడ్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహమ్మద్, కాలనీ ప్రజలు ఎం.జయమ్మ, ప్రేమమ్మ, నాగమణి, రంగయ్య, నాగన్నలతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.


అధ్వానంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

## ఆకాశం.. అరుణ వర్ణం

రెండ్రోజుల నుంచి వర్షం తగ్గుముఖం పట్టడంతో ఆకాశం వివిధ వర్ణాలతో శోభిల్లుతూ కనిపిస్తోంది. ఒకసారి అరుణవర్ణం.. మరోసారి సువర్ణ కాంతులను వెదజల్లుతూ ఆహ్లాదక వాతావరణాన్ని సృష్టిస్తోంది. ఈ దృశ్యాలను చూస్తూ ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు.

–మహానంది


అరుణవర్ణంలో ఆకాశం


బంగారు వర్ణంతో హోయలొలుకుతున్న ఆకాశం